15, 16 తేదీల్లో శాస్త్రీయ సంగీత నృత్య అంశాలపై జాతీయ సదస్సు

ప్రజాశక్తి-కల్చరల్

తెలుగు విశ్వవిద్యాలయం, నవ్య నాటక సమితి సంయుక్తంగా ఈ నెల 15, 16 తేదీల్లో శాస్త్రీయ సంగీతం, నృత్యం అంశాలలో గంధర్వమ్ సాధనతో సాధ్యం శీర్షికన జాతీయ సదస్సును తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్‌టిఆర్ కళా మందిరంలో నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించిన వివరాలను తెలుగు విశ్వవిద్యాలయం నృత్య శాఖాధిపతి డాక్టర్ వనజాఉదయ్, నవ్య నాటక సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్ తెలిపారు. కర్ణాటక సంగీతం, హిందూస్థాని సంగీతం, భరత నాట్యం, కూచిపూడి, కథక్, ఆంధ్ర నాట్యం ప్రక్రియలపై గురువులు, ప్రముఖ కళాకారులు ప్రసంగాలు చేస్తారని, సుమారు 50పైగా జాతీయ విశ్వవిద్యాలయాల ఆచార్యులతోపాటు వేద పండితులు, డాక్టర్లు, ఇంజినీర్లు, ఐటి రంగ నిపుణులు పాల్గొంటారని వారు తెలిపారు. ఈ రెండు రోజుల సదస్సులో జంట నగరాలకు చెందిన కళాకారులు హాజరై కళలకు సంబంధించిన అనేక విషయాలు తెలుసుకోవాలని కోరారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికను పే అండ్ అకౌంట్స్ ఉన్నతాధికారిణి వసుంధర, నృత్య కళాకారులు సుధామాల, గీతా గణేష్, శ్రీలత, వాణీ రమణలతో కలిసి ఆవిష్కరించారు.

స్వచ్ఛమైన గాంధేయవాది మల్లికార్జున శర్మ

- ఎమ్మెల్సీ సురభి వాణీ దేవి

ప్రజాశక్తి - కల్చరల్

నిరాడంబరత, నైతికత విలువలు పాటించే మల్లికార్జున శర్మ స్వచ్ఛమైన గాంధీయవాది అని ఎమ్మెల్సీ సురభివాణీ దేవి అన్నారు. రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో జానకి మల్లికార్జునశర్మ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహణలో నాటి మద్యపాన వ్యతిరేక కమిటీ చైర్మన్, రవీంద్రభారతి కార్యదర్శి ఐన ఉప్పలూరి మల్లికార్జున శర్మ 85వ జయంతి సభ జరిగింది. ముఖ్య అతిథిగా వాణీదేవి పాల్గొని మల్లికార్జున శర్మ స్మారక నగదు పురస్కారం రంగస్థల ప్రముఖుడు హరిచంద్ర రాయలుకు బహూకరించి మాట్లాడారు. బతికి ఉండగానే ముసలివారైన తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో చేరుస్తున్న నేటి కాలంలో తల్లిదండ్రులు పేరిట నగదు పురస్కారం ప్రతి ఏటా అందిస్తున్న శర్మ కుమారుడు శ్రీనివాస్ కుమార్తె విజయభారతి అభినందనీయులు అన్నారు. శర్మ మద్యపాన నిషేధం అమలుకు నిరతరం పోరాడాని, మా తండ్రి పివికి అత్యంత అభిమాన పాత్రుడని వివరించారు. రాష్ట్ర పర్యాటక అభివద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ మాట్లాడుతూ నాటిముఖ్యమంత్రి రోశయ్య, మల్లికార్జున శర్మ రాజకీయాలలో నిజాయితే ప్రతీకలు అన్నారు. ఇరువురూ నాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి కి ఆత్మీయులని పేర్కొన్నారు. సంఖ్యాశాస్త్రవేత్త దైవజ్ఞ శర్మ అధ్యక్షతన జరిగిన సభలో సీనియర్ జర్నలిస్ట్ సూర్య ప్రకాష్ ప్రసంగంలో మల్లికార్జునశర్మ వ్యక్తిత్వం అవిష్కరించారు. మల్లికార్జున శర్మ కుటుంబ సభ్యులు పాల్గొన్న కార్యక్రమానికి ట్రస్ట్ నిర్వాహకుడు ఉప్పలూరి శ్రీనివాస్ స్వాగతం పలికారు. గాంధీ వ్యాఖ్యానంలో కందుకూరి సత్యవతి శిష్యులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

పెండింగ్ దస్త్రాలు త్వరగా పరిష్కరించండి

ఢిల్లీలో కేంద్ర కార్యదర్శులకు సిఎస్ శాంతికుమారి విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని పలు అభివృద్ధి పథకాలకు సంబంధించి కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న దస్త్రాలను త్వరగా పరిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆమె ఢిల్లీలో ఒక్కరోజు పర్యటన నిమిత్తం వెళ్లారు. అక్కడ వేర్వేరు శాఖలకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులతో భేటీ అయ్యారు. కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్, కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ కార్యదర్శి లీలానందన్, కేంద్ర రహదారులు, రవాణా, జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి అనురాగ్ జైన్‌లతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. సికింద్రాబాద్ ప్యారడైజ్ జంక్షన్ నుంచి కండ్లకోయ ఔటర్ రింగ్ రోడ్ (ఒఆర్ఆర్) వరకు, ప్యారడైజ్ నుంచి కరీంనగర్, రామగుండం మార్గంలో ఒఆర్ఆర్ వరకు నిర్మించ తలపెట్టిన రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం, మెహిదీపట్నం జంక్షన్‌లో ప్రతిపాదిత స్కై- వాక్ నిర్మాణ పనులకు అవసరమైన 150.39 ఎకరాల రక్షణ శాఖ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయింపు చేయాలని సిఎస్ శాంతికుమారి కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్‌ను కోరారు. ఆ భూములకు సరిపడా ప్రత్యామ్నాయ భూములను కూడా అందిస్తామని ఆమె ప్రతిపాదించారు. అలాగే జాతీయ వన్యప్రాణి సంరక్షణ బోర్డులో రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన 60 ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయనీ, వాటికి ఆమోదం తెలుపాలని కోరారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలు, పిఎమ్‌జిఎస్‌వై పనులకు సంబంధించి అటవీశాఖ అనుమతులు ఇవ్వడానికి నేషనల్ బోర్డు ఫర్ వైల్డ్ లైఫ్ కమిటీ ప్రత్యేక సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని కోరారు. కేంద్ర రహదారులు, రవాణా, జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి అనురాగ్ జైన్‌తో భేటీ అయ్యి రీజనల్ రింగ్ రోడ్ నిర్మాణ పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పలు ప్రతిపాదనలకు ఆమోదం తెలపాలని కోరారు. సిఎస్ వెంట రాష్ట్ర ప్రభుత్వ రవాణా, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాస రాజు, తెలంగాణా భవన్ రెసిడెంట్ కమీషనర్ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.

గీత కార్మికులకిచ్చిన హామీలు అమలు చేయండి

- కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రమణ, వెంకటేశ్వర్లు
- కలెక్టరేట్ల ఎదుట కెజికెఎస్ ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గౌడ ఆత్మీయ సమ్మేళనంలో కల్లుగీత కార్మికులకు మంత్రి కెటిఆర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం (టికెజికెఎస్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎంవి రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో ప్రదర్శనలు, కలెక్టరేట్ల ఎదుట ధర్నా నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లాలో కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రమణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 5 లక్షల కుటుంబాలు నేటికి కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. ఏటా రాష్ట్రంలో సుమారు 550 మందికిపైగా ప్రమాదానికి గురవుతుండగా, ఈ ఏడాది ఇప్పటికే 180 మంది చనిపోయారని తెలిపారు. కల్లుగీత పారిశ్రామిక సహకార ఆర్థిక సంస్థ గీత కార్మికులకు రుణాలు ఇవ్వడం, నీరా, తాటి ఉత్పత్తుల శిక్షణా కేంద్రం ఏర్పాటు, నందనంలో 5 ఎకరాల భూమి కొనుగోలు తదితర కార్యక్రమాలు చేపట్టగా, ప్రభుత్వం వాటికి బడ్జెట్ కేటాయించకపోవడంతో ప్రస్తుతం నిర్వీర్యం అయ్యాయన్నారు. బిసి కుల వృత్తులకు రూ.లక్ష ఆర్థిక సహాయం గడువు 15 రోజులు మాత్రమే ఇవ్వడంతో కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు అందక 13 వేల మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని, కాబట్టి అందరికీ అందుబాటులో ఉండేలా మరొక 15రోజులు పొడిగించాలని కోరారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాను కలిసి వినతిపత్రం అందించారు. హన్మకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి వినతిపత్రం సమర్పించారు. ములుగు జిల్లాలో డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు.

ఇంకా అద్దె భవనాలే

- బాత్రూంలు, స్నానాల గదుల్లేక విద్యార్థుల అవస్థలు
- మెనూ ప్రకటించినా విడుదలలో జాప్యం
- నోట్‌బుక్స్ కోసం ఎదురు చూపులు
- ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బందులు
- వంట సరుకులకూ టెండర్లు పిలవని వైనం
- పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో అనేక సంక్షేమ గురుకులాలు ఇంకా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వీటిల్లో తిష్ట వేసిన సమస్యలు విద్యార్థులకు చుక్కలు చూపిస్తున్నాయి. పరిష్కారానికి పూనుకోవాల్సిన సర్కార్ మీనమేషాలు లెక్కిస్తున్నది. మాటలు ఘనం.. చేతలు శూన్యమన్నట్టుగా గురుకులాల నిర్వహణ ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు, సిబ్బంది దశాబ్ది ఉత్సవాల కార్యక్రమంలో నిమగ్నం కావడం మూలంగా ఈ ఏడాది చేయాల్సిన రిపేర్లు చేయలేకపోయామని కొన్ని చోట్ల నిర్వహకులు చెబుతున్నారు. దీంతో ఊడిపోయిన బాత్రూం తలుపులు, పగిలిన కిటికీలు, తిరగని ఫ్యాన్లు, పాడైన నల్లా ట్యాపులు ఇత్యాది అనేక సమస్యలు యథాతథంగా దర్శనమిస్తున్నాయి.

సగం అద్దె భనాలే..

మొత్తం గురుకులాల్లో సగం అద్దెభవనాల్లోనే నడుస్తున్నాయి. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సంక్షేమ గురుకుల సొసైటీల పరిధిలోని సుమారు 650 గురుకులాలు అద్దెభవనాల్లోనే ఉన్నాయి. వాటి నిర్వహణ కోసం ఒక్కో గురుకులానికి నెలకు రూ.20 వేల చొప్పున ఇస్తున్న నిర్వహణ నిధులు విద్యార్థుల కనీస అవసరాలు తీర్చలేకపోతున్నాయని ఇప్పటికే సర్కారు దృష్టిలో ఉంది. ఇదిలా ఉంటే.. ప్రతి ఏటా తరగతులను అప్‌గ్రేడ్ చేస్తూ జూనియర్ కళాశాలలుగా మారుస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటిస్తున్నది. తగిన మౌలిక సదుపాయాలు కల్పించకుండా ఆడంబరంగా నిర్ణయాలు తీసుకోవటం వల్ల ప్రయోజనం చేకూరటం లేదని విద్యార్థులు చెబుతున్నారు.

ఘనమైన మాటలు..

'రాష్ట్రంలో గురుకులాల విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. ఒక్కోవిద్యార్థిపై ఏటా రూ.1.25 లక్షలు ఖర్చు చేస్తున్నాం' సంక్షేమ పథకాలపై చర్చ సందర్భంగా ప్రభుత్వ పెద్దలు చెబుతున్న మాటలివి. ఏడాదికి సుమారు రూ. 5 వేల కోట్లకుపైగా విద్యార్థులపై ఖర్చు చేస్తున్నట్టు వెల్లడిస్తున్నారు. కొన్ని గురుకులాలపై కేంద్రీకరించి, అక్కడ తగిన రిజల్ట్ రాబట్టి, వాటిని చూపించి.. మొత్తం గురుకులాలు వాటిలాగే ఉన్నట్టు ప్రభుత్వం ప్రచారం కల్పిస్తున్నదని విమర్శలున్నాయి. ఎక్కువ గురుకులాలు సమస్యల కేంద్రాలుగా మారాయి. అద్దె భవనాలు, ఇరుకు గదులు బాత్రూంల ఇక్కట్లు, మరుగుదొడ్ల కష్టాలు.. మంచినీటి వెతలు, ఆరుబైట స్నానాలు, బోధకుల లేమి, నియమ బద్ధంగా సాగని చదువులు... వెరసి గురుకుల హాస్టళ్లలో విద్యార్థులు అష్ట కష్టాలు పడుతున్నారు.

పెరిగిన ధరలు.. నాణ్యత లేని మెనూ..

మెనూ చార్జీలు పెంచుతున్నట్టు ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ఆచరణలో అమలు కావటం లేదు. ఇదేందని అడిగితే.. ప్రభుత్వం ఇంకా జీవో విడుదల చేయలేదని నిర్వహకులు చెబుతున్నారు. రోజు రోజుకు నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నాయి. 2014 నాటి ధరలతో పోల్చి చూస్తే.. ఇప్పుడు 300 శాతానికిపైగా ధరలు పెరిగాయి. పెరగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని విద్యార్థులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. అయినా ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నది. పైగా 2014లో ఉన్న ధరల ఆధారంగా బడ్జెట్ కేటాయింపులు చేస్తున్నది. దీంతో ఆహారంలో నాణ్యత తగ్గింది. నీళ్ల చారు, పలచటి పప్పు, అప్పుడప్పుడు కూరగాయల భోజనం. ఎక్కువగా సాంబారు, పప్పు వండి వారుస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. మాంసం ధరలు బాగా పెరిగాయి. దీంతో వారానికి రెండు సార్లు పెట్టాల్సిన మాంసాహారం కూడా కనా కష్టంగా పెట్టాల్సి వస్తున్నదని నిర్వాహకులు చెబుతున్నారు. మరో పక్క వంట సరుకులకు నేటికీ టెండర్లు పిలవలేదు. దీంతో నిర్వహకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఉపాధ్యాయుల కొరత.. బోధన సమస్యలు..

సాధారణ పాఠశాలలకంటే.. గురుకులాల్లో ఉపాధ్యాయుల కొరత మరింత ఎక్కువగా ఉంది. ముఖ్యంగా బీసీ గురుకులాల్లో ఈ సమస్య ఎక్కువగా వేదిస్తున్నట్టు తెలుస్తున్నది. పార్ట్‌టైం, గెస్ట్‌ఫ్యాకల్టీల రిక్రూట్‌మెంట్ కూడా ఇప్పటి వరకు చేయలేదు. దీంతో అన్ని తరగతులకు సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు సతమతమవుతున్నారు. ఇటీవల ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేస్తున్నట్టు ప్రకటించింది. ఇప్పటికే తరగతులు ప్రారంభం కావడంతో విద్యార్థులకు తగిన విధంగా బోధన అందడంలేదని వారు వాపోతున్నారు. మరో పక్క నేటికీ విద్యార్థులకు అందించాల్సిన నోట్ పుస్తకాలు అందకపోవటంతో ఎప్పుడొస్తాయా? అని ఎదురు చూస్తున్నారు.

సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం..

తాళ్ల నాగరాజు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

తొంభై శాతం అద్దె భవనాల్లోనే గురుకులాలు నడుస్తున్నాయి. సరైన సౌకర్యాల్లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచటం లేదు. ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది.

గురుకులాల సమస్యలు గుర్తించటంలో సర్కార్ మాటలకే పరిమిత మైంది. అధికారుల క్షేత్ర స్థాయి పరిశీలన లేదు. అద్దె వ్యవహారంలో అవినీతి జరుగుతున్నదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీటిని నివత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. గోరంత చేసి కొండంత చేసినట్టు ప్రచారం చేసుకోవటం వల్ల విద్యార్థులకు జరిగే ప్రయోజనం ఏమీ లేదు. ఎస్ఎఫ్ఎస్ఐ ఆధ్వర్యంలో సర్వేలు నిర్వహిస్తున్నాం. త్వరలో ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తాం.

ఆర్‌జియుకెటి విద్యార్థి అదృశ్యం

పోలీస్‌స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటి విద్యార్థి అదృశ్యం కలకలం రేపుతోంది. నెల రోజుల కింట యూనివర్సిటీలో ఒక విద్యార్థిని ఆత్మహత్య, మరో విద్యార్థిని ప్రమాదవశాత్తు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనల భయాందోళన నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు బయటపడక ముందే మరో విద్యార్థి అదృశ్యం ఆందోళనకు గురిచేస్తోంది. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం నర్సంపల్లికి చెందిన కత్తి బన్నీ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నారు. గత గురువారమే బన్నీ యూనివర్సిటీ నుంచి ఔట్ పాస్ తీసుకొని బయటకు వెళ్లారు. ఇంటికీ వెళ్లలేదు. నాలుగు రోజులుగా విద్యార్థి మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ ఉండడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. తల్లిదండ్రులు యూనివర్సిటీకి వచ్చి వాకబు చేశారు. బన్నీ గురువారమే యూనివర్సిటీ నుంచి వెళ్లిన సిసి ఫుటేజీ, రిజిస్టర్‌లో సంతకం ఉండడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

పోలీసులు రైల్వే స్టేషన్‌లోని సిసి కెమెరాలు పరిశీలించారు. గురువారమే ఇంటర్ సిటీ ట్రైన్ ఎక్కి మహారాష్ట్ర వెళ్లినట్టు తెలుస్తోంది. పోలీసులు ఆ దిశగా దర్యాప్తు ముమ్మరం చేశారు. బలమైన కారణం లేకుండా విద్యార్థులను అవుట్ పాస్ ఇచ్చి పంపడంపై తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండాలంటే తల్లిదండ్రుల అనుమతి లేనిది యూనివర్సిటీ అవుట్ పాస్ ఇవ్వకూడదని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

రేపటి విద్యాసంస్థల బంద్

వామపక్ష యువజన సంఘాల సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈనెల 12న వామపక్ష విద్యార్థి సంఘాలు తలపెట్టిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల (పాఠశాలలు, జూనియర్ కళాశాలల) బంద్‌కు వామపక్ష యువజన సంఘాలు డివైఎఫ్ఐ, ఎఐవైఎఫ్, పివైఎల్, ఎఐఎఫ్‌డివై రాష్ట్ర కమిటీలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ప్రత్యక్షంగా బంద్‌లో పాల్గొనాలని నిర్ణయించాయి. వామపక్ష యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి సమావేశం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని రాజ్‌బహదూర్‌హాల్‌లో సోమవారం నిర్వహించారు. విద్యాసంస్థల బంద్‌కు సంబంధించిన గోడపత్రికను ఆయా సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధర్మేంద్ర, పివైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ ప్రదీప్, ఎఐఎఫ్‌డివై రాష్ట్ర కార్యదర్శి వనం సుధాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనా నేటికీ ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు అందలేదనీ, మౌలిక సదుపాయాల కల్పన జరగలేదని చెప్పారు. ఒకవైపు ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తున్నామంటూ ప్రకటనలు చేస్తున్నా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిఒ నెంబర్ ఒకటి నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు యథేచ్ఛగా విద్యావ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయని విమర్శించారు. చదువు'కొన'గలిగే వారికే అందుతున్నదని అన్నారు. ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై విద్యాశాధికారుల ఆజమాయిషీ తగ్గిందని, అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నా, అనధికారికంగా విద్యాసంస్థలను నడిపిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి జావీద్, ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నిర్లకంటి శ్రీకాంత్, మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సల్మాన్ బైగ్, టి సత్యప్రసాద్, పివైఎల్ రాష్ట్ర నాయకులు రవికుమార్, బి కృష్ణ, బి శ్రీనివాస్, రాజు, ఏఐఎఫ్‌డీవై హైదరాబాద్ జిల్లా నేత మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యార్థి సంఘాలు ఈనెల 12న తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌కు తెలంగాణ ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్ల ఫెడరేషన్ (టిపిటిఎల్ఎఫ్) మద్దతు ప్రకటించింది.

కెసిఆర్‌దే హ్యాట్రిక్ విజయం

- ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- అందోల్, జహీరాబాద్ నియోజకవర్గాల్లో 1127 మందికి పోడు పట్టాల పంపిణీ
- పటాన్‌చెరులో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా.. రాబోయే ఎన్నికల్లో కెసిఆర్ ప్రభుత్వం హ్యాట్రిక్ విజయం సాధించడం పక్కా అని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల దింపుడు కళ్ళం ఆశలను ప్రజలు తిప్పికొడతారన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లాలో పర్యటించిన మంత్రి.. జహీరాబాద్-పస్తాపూర్‌లోని ఎస్‌వి కన్వెన్షన్ హాల్‌లో అందోల్, జహీరాబాద్ నియోజకవర్గాల్లోని 1127 మందికి 1808.07 ఎకరాలకు పోడు భూముల పట్టాలను అందజేశారు. అలాగే పటాన్‌చెరు డివిజన్ పరిధిలో రూ.3 కోట్లా 26 లక్షలతో నిర్మించిన ఫ్రీడమ్ పార్క్, 150 అడుగుల జాతీయ జెండా, రూ.2.40 కోట్లతో నిర్మించిన ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్, రూ.1.50 కోట్లతో నిర్మించిన డిసిసిబి బ్యాంకు నూతన భవనాలను స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశాల్లో మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా పోడుకు పట్టం గట్టి గిరిజనులను రాజులను చేయడంతో పాటు.. ఎస్టీలకు పది శాతం రిజర్వేషన్‌లను కల్పించిన ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. కెసిఆర్ ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో 3,146 తండాలను గ్రామ పంచాయతీలుగా చేశారన్నారు. 'మా తండాలో మా రాజ్యం' అన్న గిరిజనుల కలను నిజం చేశారన్నారు. ప్రముఖ సినీ నటుడు రజినికి తెలంగాణలో జరిగిన అభివృద్ధి అర్థమయింది కానీ, రాష్ట్రంలో ఉన్న కొంతమంది గజనీలకు అర్థం అవడం లేదని, కనిపిస్తలేదని ఎద్దేవా చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ దక్షిణాది రాష్ట్రాలపై చిన్న చూపు చూడటంతో పాటు తెలంగాణకు రావాల్సిన కోచ్ ఫ్యాక్టరీని ఉత్తరాది రాష్ట్రాలకు తరలించి కేవలం రూ.6000 కోట్లతో వ్యాగన్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం వారి వివక్షతకు నిదర్శనమని విమర్శించారు. బిజెపి దక్షిణాది రాష్ట్రాలకు ఏమైనా ఇచ్చింది అంటే కేవలం 'శిష్కప్రియలు శూన్య హస్తాలు మాత్రమే' అని అన్నారు. తమ పార్టీ పక్కన పెట్టిన నాయకులను ప్రతిపక్ష పార్టీలు చేర్చుకుంటూ అధ్యక్షులుగా పట్టం కట్టాయని విమర్శించారు. జహీరాబాద్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెడతానన్నారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త ఢిల్లీ వసంత్ బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు మంత్రి హరీశ్‌రావు కండువా కప్పి ఆయన్ను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టిపిసిసి నాయకులు వై.నరోత్తం ఇటీవలే కెసిఆర్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారని, ఇప్పుడు ఢిల్లీ వసంత్ కూడా చేరడంతో ఇతర పార్టీలకు అభ్యర్థులే కరువయ్యారన్నారు.

కార్యక్రమాల్లో ఎంపి బీబీ పాటిల్, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ భూపాల్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శరత్, ఎస్‌పి రమణ కుమార్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఎమ్మెల్యేలు మహిపాల్‌రెడ్డి, మాణిక్ రావు, చంటి క్రాంతికిరణ్, హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొ రేషన్ చైర్మెన్ చింతా ప్రభాకర్, డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు పెండింగ్‌లో లేవు

- రాజ్ భవన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గవర్నర్ కార్యాలయంలో ఒక్క బిల్లు కూడా పెండింగ్‌లో లేవని రాజ్‌భవన్ స్పష్టం చేసింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. మూడు బిల్లులు క్లియర్ అయినట్టు వెల్లడించింది.

రెండు బిల్లులు ప్రెసిడెంట్ కార్యాలయానికి రిఫర్ చేసినట్టు తెలిపింది. మిగిలిన బిల్లులను అవసరమైన వివరణ కోరుతూ తిరిగి పంపించినట్టు వివరించింది. రాజ్‌భవన్‌కు సంబంధించిన ఏదైనా వార్త ప్రచురించే లేదా ప్రసారం చేసేముందు అధికారిక వివరణ తీసుకోవాలని కోరింది.

IN THE COURT OF THE HON'BLE MACT/ X Addl. CHIEF JUDGE CITY CIVIL COURT; AT HYDERABAD
O.P.NO. : 1927 of 2022

Between:

S.Subbu ...Petitioners

AND

M/S. NCL Industries Ltd., &another ...Respondents

To,
1.M/s. NCL Industries Ltd, epby K. Gautham, O/o.Survey No. 30,31, Pinapaka, Main Road, G. Kondur, Krishna Dist.,
2. Shaik Khaja Miya S/o. Khaleel Miya, Age Major, Occ: Driver, R/o.H.No.3-2-80, Nehru Nagar, Khammam Urban

please take notice that the above petitioner had filed the case for grant of compensation for the injuries sustained by me in a motor vehicle accident which occurred on 19-7-2022 under the limits of P.S.Nadiama

The above case is posted to **27-07-2023 10-30 AM** for your appearance and counter. If you fail to appear before this Hon'ble Court on specified date and time either in person or through an advocate, else the case will be decided exparte.

(BY ORDER OF THE COURT)
P.V.RAMANA MURTHY
ADVOCATE
COUNSEL FOR THE PETITIONER
H.NO. 3-7-6 Sri Sai Nagar Colony, Mansoorabad L.B Nagar, Hyderabad-68
Cell No; 9391008850

IN THE COURT OF THE MACT CUM IX ADDL. CHIEF JUDGE CITY CIVIL COURT AT :: HYDERABAD
O.P.NO. **676** OF **2022**

Between:
Anreddy Narayan Reddy. ...Petitioner.

AND

Kowkuntla Srisailam & others. ...Respondents.

To,
Kowkuntla Srisailam, S/o. K.Krishna Goud, aged major, Occ: Owner of Maruti Alto Car bearing No.TS 06 FD 8467, R/o. H.No.SS-1-50, Marlu, Mahabubnagar District, Telengana State.

Sir,

Please take notice that the petitioner has filed MVOP. No. 676/2022 on the file of IX Additional Chief Judge, City Civil Court, Hyderabad for claiming compensation against you and respondents no.1 and 3 there in MVOP for the injuries sustained by the petitioner in a road accident with occurred on 17-02-2022 at about 03:30 PM. The above said O.P. is posted to **20-07-2023** at **10.30** AM for your appearance and counter. Kindly make it convenient to be present on the said date before the Hon'ble Court by 10.30 AM in person or through your counsel, failing which the matter will be decided on your obsence.

Thanking you,

M. VIJAY REDDY
ADVOCATE
2-2-647/A/58,Saibabanagar, Bagh Amberpet, Hyderabad 500 013
Ph: 7673904549

BEFORE THE HON'BLE STATE CONSUMER DISPUTES REDRESSAL COMMISSION OF TELANGANA AT :: HYDERABAD.
F.A. NO: **90** OF **2023**

Between :
Mr. Sonar Krishna Murthy, … Appellant / Opp. Party

AND

1. Smt. Thummala Swarna Reddy, and another …Respondents/ Complainants

To,
1. Smt. Thummala Swarna Reddy, W/o. Late Thummala Prabhakar Reddy, Aged about 61 years, Occ: Housewife.
2. Smt. Thummala Shilpa Reddy, W/o. Late Thummala Prabhakar Reddy, Aged about 41 years, Both are R/o. 2-2-1133/5/B, Near Narendra Park, New Nallakunta, Hyderabad.

NOTICE

Please take notice that, the F.A.No.90/2023 on the file of the Hon'ble State Consumer Disputes Redressal Commission, stands posted to **04.08.2023** for both of your appearance. Therefore, both of you are hereby informed to appear before the Hon'ble State Consumer Disputes Redressal Commission of Telangana, Eruvaka buildings, Opp: Sridhar Function Hall, Khairatabad, Hyderabad, Telangana-500004 on **04.08.2023** at **10.30 a.m.**, failing which, the Hon'ble State Consumer Disputes Redressal Commission of Telangana, may proceed to settle the dispute in your absence.

//By the orders of the Hon'ble State Consumer Disputes Redressal Commission of Telangana//

K.VISWESWARA RAO
ADVOCATE
H.No: 2-3-103/1, Adarsh Nagar Colony Road No: 1/C, Behind Amaravati Restaurant, Nagole, Hyderabad-68.
Ph.No: 9440455188.

సమ్మెలోనే జిపి కార్మికులు

- పలువురి సంఘీభావం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమస్యల పరిష్కారం కోసం గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె కొనసాగిస్తున్నా రు. తమను పర్మినెంట్ చేయా లని, వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ ఎంపిడిఒ కార్యాలయం వద్ద గ్రామ పంచాయితీ కార్మికుల ఐదో రోజు సమ్మెను ప్రారంభించారు. అనంతరం జెఎసి నాయ కులు మాట్లాడుతూ.. ప్రభుత్వం మాన వీయతను ప్రదర్శించి తక్షణమే చర్చలకు పిలిచి సమస్యలను పరిష్క రించాలని కోరారు. నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి పంచాయతీ కార్మికులను కించ పరుస్తూ వ్యాఖ్యానించడాన్ని ఖండిస్తున్నట్టు చెప్పారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల కేంద్రంలో జిపి కార్మికుల దీక్షకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ సంఘీభావం తెలిపారు. కల్లూరులో కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు మట్ట దయానంద్ సంఘీభావం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వా రావుపేటలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు సంఘీభావం తెలిపి, సమ్మెకు మద్దతుగా 10వేలు రూపాయలు అందజేశారు. అశ్వాపురంలో వంటావార్పు నిర్వహించారు. దమ్మ పేటలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు వగ్గేల పూజ మద్దతు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం ఎదుట గ్రామ పంచా యతీ సిబ్బంది చేపట్టిన సమ్మె శిబిరాన్ని గ్రామపంచాయతీ జెఎసి రాష్ట్ర కన్వీనర్ పాలడుగు సుధాకర్ సందర్శించి మాట్లాడారు. గ్రామపంచాయతీలో పని చేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, పిఆర్‌సిలో నిర్ణయించిన బేసిక్ ప్రకారం రూ.19 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. రామన్నపేట మండల కేంద్రంలో పంచాయతీ కార్మికుల సమ్మెకు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి .జహంగీర్ మద్దతు తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో జీపీ కార్మికుల సమ్మెకు ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి మద్దతు తెలిపారు.

ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలి

- అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
- అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ధర్నాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలని, అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలపై అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆలిండియా పిలుపు మేరకు సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ధర్నా చౌక్ నుంచి కొత్త కలెక్టరేట్ వరకు నల్ల చీరెలతో పది కిలో మీటర్ల మేర అంగన్‌వాడీలు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేండ్లు అవుతున్నా అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను ఏ ఒక్కటీ పరిష్కారం చేయలేదన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు అనేక రెట్లు పెరుగుతున్నా.. అందుకనుగుణంగా కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీల వేతనాలు పెంచడం లేదని విమర్శించారు. 2018లో టీచర్లకు రూ.1,500, హెల్పర్లకు రూ.750, మినీ వర్కర్లకు రూ.1,250 కేంద్ర ప్రభుత్వం పెంచిందని గుర్తు చేశారు. కేంద్రం వాటా తన బడ్జెట్‌ను 40 శాతం తగ్గించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని చెల్లించడం సాధ్యం కాదని చెబుతున్నాయన్నారు. బడ్జెట్ తగ్గింపుతో వేతనాలే కాక, మొత్తం ఐసిడిఎస్ సేవలకు అంతరాయం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో టిఆర్‌ఎస్ ప్రభుత్వం ఆన్‌లైన్‌లో అనేక యాప్‌లు పెట్టి అంగన్‌వాడీలపై పని భారాన్ని పెంచుతున్నదని విమర్శించారు. ఆసరా, కళ్యాణ లక్ష్మి తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అంగన్‌వాడీ ఉద్యోగులు అనర్హులని ప్రభుత్వం చెబుతున్నదని, ఇటు కనీస వేతనం లేక, అటు సంక్షేమ పథకాలు అమలు కాక ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ తహసీల్దార్ కార్యాలయం నుంచి పది కిలోమీటర్ల పాదయాత్రతో భారీ ప్రదర్శనగా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న అంగన్‌వాడీలు.. మధ్యాహ్నం నుంచి సాయంత్రం 5 గంటల వరకు కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. వారి నినాదాలతో కలెక్టరేట్ మారుమోగిపోయింది. పలు దఫాలుగా జరిగిన ధర్నాల్లో జిల్లా డిడబ్ల్యూడిఆర్‌ఒ సిఐటియు నాయకులతో చర్చలు జరిపినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదని, అందుకే నేరుగా కలెక్టర్‌తోనే మాట్లాడాలని అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు పట్టుపట్టారు. అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్ మాట్లాడుతూ.. ఐసీడీఎస్‌ను ప్రభుత్వ శాఖగా గుర్తించి, కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సంగారెడ్డి జిల్లాలో వేలాది మంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు నల్లచీరలు ధరించి.. స్థానిక ఐబీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు మండుటెండలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఐసిడిఎస్ పిడి, డిఆర్‌ఒకు వినతి పత్రాలు ఇచ్చారు. బిఎల్‌ఒ డ్యూటీలను రద్దు చేయాలని అధికారులను కోరగా పరిశీలిస్తామని చెప్పారు. సిద్దిపేట జిల్లాలో అంగన్‌వాడీలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఏవోకు వినతిపత్రం ఇచ్చారు. మెదక్ జిల్లాలో వందలాది మంది అంగన్వాడీలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. నల్లగొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట వందలాది మంది అంగన్వాడీలు నల్ల చీరలతో నిరసన వ్యక్తం చేస్తూ మహా ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణికు వినతి పత్రాలు అందజేశారు.

నిర్మల్ జిల్లా కేంద్రంలో డిగ్రీ కళాశాల నుంచి సమీకృత కలెక్టర్ భవనం వరకు అంగన్వాడీలు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీలు నల్లదుస్తులు ధరించి, రైల్వే స్టేషన్ నుంచి పంజాబ్ చౌక్, కలెక్టర్ చౌక్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీలు నల్ల చీరలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్‌కు చేరుకుని ఆర్డీఓ రాజేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీలు నల్ల చీరలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. నస్పూర్‌లోని కలెక్టరేట్‌కు చేరుకుని అదనపు కలెక్టర్ రాహుల్‌కు వినతి పత్రం అందజేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కలెక్టరేట్ ఎదుట ధర్నా(బ్లాక్‌డే) నిర్వహించారు.

కనీస వేతనం జిఓలను సవరించాలి

- లేబర్ కోడ్లు రద్దు చేయాలి
- 14న కలెక్టరేట్ల ఎదుట ధర్నాను జయప్రదం చేయండి
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్, భూపాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని, కనీస వేతనాల జిఒలను సవరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్, భూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు సవరించాలని రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న జీపు జాత సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కర్కపట్ల, గజ్వేల్ ములుగులో సోమవారం పర్యటించింది. పరిశ్రమల్లో సర్వే నిర్వహించి కార్మికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం గజ్వేల్ పట్టణ పరిధిలోని రానే బ్రేక్ లైనింగ్ పరిశ్రమ గేటు ఎదుట జరిగిన సభలో వారు మాట్లాడారు. కూరగాయలు, నిత్యవసర సరుకులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ల ధరలు అనేక రెట్లు పెరిగాయన్నారు. కానీ వాటికి అనుగుణంగా కార్మికుల వేతనాలు మాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2006లో వచ్చిన జిఒలను రాష్ట్రంలో అమలు చేస్తుండడంతో కార్మికులందరూ శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. అనేక పరిశ్రమల్లో కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడం లేదని, కనీస వేతనాలు, ఇఎస్ఐ, పిఎఫ్, బోనస్, గ్రాడ్యూటీ లాంటివి ఉండటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పర్మినెంట్ కార్మికుల సంఖ్య తగ్గిపోయిందని, కాంట్రాక్ట్ కార్మికులే మొత్తం ఉత్పత్తిలో ఉంటున్నారన్నారు. అనేక పరిశ్రమల్లో ఉత్తర భారతదేశం నుంచి వలస వచ్చిన వారు కార్మికులుగా పనిచేస్తున్నారని, వారికి 1979 వలస కార్మిక చట్టాన్ని ఏ పరిశ్రమలోనూ అమలు చేయడం లేదన్నారు. 12 గంటలు పనిచేసినా రూ.10 వేలు మాత్రమే ఇస్తూ వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం గజ్వేల్‌లో కూడా ప్రస్తుతం ఉన్న చట్టాలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి కోడ్లను తెచ్చిందన్నారు. రోజుకు 178 రూపాయలు వేతనం ఉంటే సరిపోతుందని కార్మికులను అవహేళన చేస్తున్నారని తెలిపారు. కనీస వేతనాల పెంపుదల కోసం ఉద్యమించాలని 14న అన్ని కలెక్టరేట్ల ఎదుట జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య గోపాలస్వామి ఉపాధ్యక్షులు బండ్ల స్వామి వేణుగోపాల్, రంగారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, నర్సింలు మల్లయ్య, బిక్షపతి, వెంకట్రావు, స్వామి, సాజిద్, సురేష్, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

సెకండ్ ఎఎన్ఎంలను రెగ్యులర్ చేయండి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదహారు సంవత్సరాల నుంచి ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న రెండో ఎఎన్ఎంలందరినీ రెగ్యులర్ చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎఐటియుసి ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎఐటియుసి రాష్ట్ర నాయకులు తోట రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన ధర్నాలో కూనంనేని మాట్లాడారు. అసలు రెండో ఎఎన్ఎం అనే పదంలోనే వివక్షత ఉందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులందరినీ ద్వితీయ శ్రేణి ఉద్యోగులుగా భావిస్తున్నారనటానికి ఈ పదమే నిదర్శనం అన్నారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు సేవ చేసిన సిబ్బందిని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఒకే పని.. ఒకే విద్యార్హత ఉండి వేతనంలో భారీ స్థాయిలో వ్యత్యాసాలు ఉండటం సరైందని కాదన్నారు. ప్రభుత్వం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయడంతోపాటు.. 20 సంవత్సరాల సేవకుగాను రిటైర్ అయ్యాక పెన్షన్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో బతుకుతున్నామని రెండో ఎఎన్ఎంలు తమ గోడును వెళ్లబోసుకుంటుంటే.. వేతనాలు చాలకపోతే ఈ పని మానేసి వేరే పనికి పోండి అని ఎగతాళి చేసిన మంత్రి హరీశ్‌రావు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు నరసింహ మాట్లాడుతూ.. సెకండ్ ఎఎన్ఎంలకు రూ.41 వేల వేతనంతోపాటు, రూ.10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి కారుణ్య నియమాకాన్ని ఆరు నెలల్లోపు అందించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌లను 15 రోజుల్లో నెరవేర్చకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కుల వివక్ష కారకులను అరెస్టు చేయాలి

- కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తిమ్మాపూర్ గ్రామంలో అందరితో సమానంగా కటింగ్ షాపులో ఎస్సీలకు క్షవరం చేయకుండా ఊరు బయట చెట్టు కింద చేస్తూ కులవివక్ష పాటించిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో దళితుల పట్ల జరుగుతున్న వివక్ష ఘటనపై అతిమేల మాణిక్‌తో పాటు ఇతర దళిత, సామాజిక, ప్రజాసంఘాల నాయకుల బృందం సోమవారం గ్రామాన్ని సందర్శించింది. బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ.. దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ కులం పేరుతో అవమానపరచడం దారుణమన్నారు. రాజ్యాంగం ప్రకారం మనుషులంతా సమానమేనని, కంప్యూటర్ యుగంలో దళితులపై వివక్ష ఏంటన్నారు. గ్రామానికి చెందిన కొందరు పెద్దలు గత నెల 8న దశాబ్ది దినోత్సవాల సందర్భంగా నిర్వహించిన చెరువు పండుగలో భోజనాలు వడ్డించే విషయంలో దళితులను అవమానపరిచారని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో కుల వివక్షత జరిగినా అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ఈ నెల 5న సెలూన్ షాప్‌కు వెళ్లిన మాదిగలకు.. షాపులో మీకు క్షవరం చేయమని, గ్రామానికి చెందిన కొందరు పెద్దలు మీకు గౌరవం ఇవ్వొద్దని చెప్పారని, మీకు బయట చెట్టు కింద చేస్తామంటూ షాపు యజమానులు చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అవమానం భరించని దళితులు.. తహశీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. కానీ ఆరు రోజులైనా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే ఈ అమానుష చర్యలకు కారకులైన ప్రతి ఒక్కరిపై ఎస్సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బక్కెల్లి బాలకిషన్, కర్రోల్ల నవీన్, జిల్లా ఉపాధ్యక్షులు మరాఠి కృష్ణమూర్తి, జిల్లా సహాయ కార్యదర్శి కర్రోల్ల ఎల్లయ్య, మునగడప నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వేదాంతకు ఫాక్స్‌కాన్ గుడ్‌బై

న్యూఢిల్లీ : భారత్‌లో చిప్‌ల తయారీకి వేదాంతతో కుదుర్చుకున్న ఒప్పందానికి ఫాక్స్‌కాన్ గుడ్‌బై చెప్పింది. సెమీ కండక్టర్ ప్లాంట్ ఏర్పాటు, తయారీకి సంబంధించిన సంయుక్త భాగస్వామ్యం నుంచి వైదొలుగుతున్నట్లు ఫాక్స్‌కాన్ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఆ ప్లాంట్‌తో భవిష్యత్తులో తమకు ఎలాంటి సంబంధమూ ఉండబోదని స్పష్టం చేసింది. సెమీ కండక్టర్ల ప్లాంట్ ఇక పూర్తి బాధ్యత వేదాంతదేనని తైవాన్‌కు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారీదారు ఫాక్స్‌కాన్ తెలిపింది. గుజరాత్‌లో రూ.1.5 లక్షల కోట్ల పెట్టుబడితో ఈ ప్లాంట్ ఏర్పాటుకు గతేడాది ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఫాక్స్‌కాన్ వైదొలిగినప్పటికీ.. ఇతర భాగస్వాములతో కలిసి ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్తామని వేదాంత తెలిపింది.

అనుభూతి, విస్టాడోమ్, ఎసి చైర్‌కార్‌లలో డిస్కౌంట్ స్కీమ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అనుభూతి, విస్టాడోమ్ కోచ్‌లతో సహా ఎసి సిట్టింగ్ వసతిని కలిగి ఉన్న అన్ని రైళ్ల ఎసి చైర్‌కార్, ఎగ్జిక్యూటివ్ క్లాసుల్లో డిస్కౌంట్ స్కీమ్‌ను రైల్వేశాఖ ప్రవేశపెట్టింది. డిస్కౌంట్ మూలకం ప్రాథమిక ఛార్జీపై గరిష్టంగా 25 శాతం వరకు ఉంటుంది. గత 30 రోజుల్లో 50 శాతం కంటే తక్కువ ఆక్యుపెన్సీ (ఎండ్ టు ఎండ్ లేదా కొన్ని నిర్దేశిత సెక్షన్లలో) ఉన్న రైళ్లు పరిగణనలోకి రానున్నాయి. సెలవులు, పండగల సమయాల్లో నడిచే ప్రత్యేక రైళ్లలో ఈ పథకం వర్తించదు. ఇంటర్-జోనల్ ఉన్న రైళ్లకు ఇతర జోన్‌లు రైల్వేలు/మేనేజింగ్ డైరెక్టర్ లేదా సిఒఎమ్/సిసిఎమ్/ పిసిసిఎమ్‌లను సంప్రదించి ఛార్జీల్లో తగ్గింపు ఇవ్వబడుతుందని రైల్వే శాఖ పేర్కొంది.

అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

- అంతయ్య వర్ధంతి సభలో రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

" నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని సింగారం గ్రామంలో పుట్టిన సాటు అంతయ్య పేద ప్రజల కోసం ఉద్యమాలు నడిపారు. భూస్వాములు, పెత్తందారుల అరాచకాలను ప్రశ్నించినందుకే ఆయనపై కాల్పులు జరిపి పొట్టన పెట్టుకున్నారు.." అని సిపిఎం ఆంధ్రప్రదేశ్ నాయకులు, రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు అన్నారు. అంతయ్య 31వ వర్ధంతి నేపథ్యంలో సింగారం గ్రామంలో పునర్నిర్మాణం చేసిన ఆయన స్థూపాన్ని మధు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ఈ ప్రాంతంలో నక్సలైట్లు పొట్టన పెట్టుకున్న అమరుల త్యాగాలు వెలకట్టలేనివని చెప్పారు. మన ముందు అంతయ్య, రహీమ్, నరసింహు, రామచంద్రారెడ్డి లేకపోయినప్పటికీ వారి ఆశయాల కోసం పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. అయినోలులో రామచంద్రారెడ్డి, బొమ్మనపల్లిలో రహీం, ఉపాధ్యాయులు కంరుద్దీన్, సుధాకర్ రెడ్డి, చంద్రమౌళి సేవలు మరువలేనివని గుర్తు చేశారు. ప్రజల కోసం, ప్రజా హక్కుల కోసం పనిచేసిన అంతయ్య, రహీం లాంటి ఉద్యమకారులను చంపడానికి భూస్వాములు మావోయిస్టులతో కుమ్మక్కయ్యారని చెప్పారు. మావోయిస్టుల నుంచి ప్రమాదాన్ని గుర్తించి 70 మంది కార్యకర్తలు కాపలాగా ఉన్నప్పటికీ రహీం ఇంటిపై బాంబులు వేసి, ఆయన్ని తుపాకి తూటాలకు బలి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

అంతయ్యను గ్రామంలో రాత్రి వేళ పట్టుకొని చేతులు కట్టేసి గోడకు నిలబెట్టి అత్యంత దారుణంగా కాల్చి చంపారని, అది పిరికిపందల చర్య అన్నారు. పేదల పక్షాన పోరాటాలు చేసిన ఉద్యమకారులను చంపి మావోయిస్టులు ఏమి సాధించారని ప్రశ్నించారు. సిపిఎం సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి ఇంటిపై దాడులకు పాల్పడ్డారన్నారు.ఎంతమంది ఉద్యమకారులను చంపినా మనోధైర్యంతో ఉద్యమాలు నడిపిన చరిత్ర ఈ సింగారం గడ్డకే దక్కిందని అన్నారు

మహిళల హక్కుల కోసం నిరంతరం పోరాడదాం

- ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు సుభాషిణి అలీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుదామని ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు సుభాషిణి అలీ అన్నారు. వరంగల్ జిల్లా పోచమ్మ మైదాన్‌లోని అబ్బూస్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఐద్వా వరంగల్ జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడిన చరిత్ర మహిళలకు ఉందని గుర్తు చేశారు. మహిళలు పోరాడి సాధించుకున్న తెలంగాణలో వారికి నీడ కరువైందని, దాని కోసం భూ పోరాటాలను ఉధృతం చేస్తామని తెలిపారు. గుడిసె వాసులకు పక్కా ఇండ్లు, పట్టాలు వచ్చేవరకు ఎర్రజెండా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రధాన మంత్రి మోడీ ఓట్ల కోసం తప్ప.. ప్రజల సంక్షేమం గురించి ఏనాడు పట్టించుకోలేదని విమర్శించారు. రేషన్ బియ్యం ఐదు కేజీలకు బదులు ప్రజలకు నాలుగున్నర కిలోలు మాత్రమే వస్తున్నాయని, బియ్యం వండుకుంటే అన్నం ఉడకటం లేదని, కనీసం మేకలు కూడా తినట్లేదని తెలిపారు. ఉచిత వంట గ్యాస్ ఇచ్చి సిలిండర్ ధరను రూ.1200కు పెంచారని అన్నారు. దాంతో మహిళలు వంట చెరుకుపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. మహిళలకు సమాన హక్కుల కోసం కొత్త చట్టం తెస్తున్నామని మోడీ చెబుతున్నవన్నీ అబద్ధాలేనని ఆరోపించారు. రెజ్లర్లపై బిజెపి నాయకుడు అఘాయిత్యానికి పాల్పడితే మోడీ ఇప్పటివరకు ఏమీ మాట్లాడలేదని, కోర్టు వారంట్ ఇచ్చినా నిందితులను అరెస్టు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నా చేసిన మహిళలు, బాధితులను మాత్రం అరెస్టు చేశారన్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఓ మహిళపై లైంగికదాడి జరిగిందని చెప్పినప్పటికీ అది అబద్ధమని అక్కడి సిఎం చెప్పడం సిగ్గుచేటన్నారు. లైంగికదాడికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన పోలీసు అధికారులు.. వారిని కొన్ని రోజులు జైల్లో పెట్టి విడుదల చేశారని, అనంతరం వారికి సన్మానాలు, సత్కారాలు చేశారని వాపోయారు. ఇంతటి దౌర్భాగ్య పాలన దేశంలో నడుస్తుందని తెలిపారు. కొత్త చట్టాలు అవసరం లేదని, పాత చట్టాలనే బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు రావలసిన నిధులన్నీ గుజరాత్‌లో పెడుతున్నారని అన్నారు. యువతకు ఉద్యోగాల కల్పనలో నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి గుళ్ళు కట్టిస్తున్నారని, ప్రధానమంత్రి రామ మందిరం కట్టించామని చెబుతున్నారే తప్ప పేదలకు ఇండ్లు మాత్రం కట్టించడం లేదని విమర్శించారు. ఎవరైనా పేదల గుడిసెలు తీసేయాలని వస్తే కర్రలతో తరిమికొట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు రంగరాజ విజయ, టాగుర్ భవాని, రామన్నపేట, రంగశాయిపేట ఏరియాల కార్యదర్శులు నల్ల రేణుక, మాలోతు ప్రత్యూష, అధ్యక్షులు ఎం జ్యోతి, కరిమబాధ్ ఏరియా అధ్యక్ష కార్యదర్శులు అప్పాజీ వాణి, మేకల సరిత, కాశీబుగ్గ ఏరియా అధ్యక్ష కార్యదర్శులు ధార సునీత, రాయి సుభద్ర, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న రమేష్

కదం తొక్కిన రైతాంగం

- భారీ ప్రదర్శన, ధర్నా, తహశీల్దార్‌కు వినతి
- సమస్యలు పరిష్కరించకుంటే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదు : సిపిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతులకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి కెసిఆర్ తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తెలంగాణ రైతు సంఘం, సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో రైతాంగం కదం తొక్కింది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల సిపిఎం కార్యాలయం రావెళ్ళ సత్యనారాయణ భవనం నుంచి భారీ ప్రదర్శనగా బయలుదేరి పొట్టి శ్రీరాములు సెంటర్ మీదుగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినదించారు. అనంతరం తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు రచ్చ నరసింహారావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ మాట్లాడుతూ.. రైతాంగ సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే రానున్న కాలంలో రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన లక్ష రూపాయల రైతు రుణమాఫీని.. ఐదేండ్లు గడుస్తున్నా ప్రభుత్వం ఆ ఊసే ఎత్తకపోవడం దారుణమన్నారు. అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతాంగానికి పరిహారం ఇస్తానని చెప్పి నెలలు గడుస్తున్నా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి నేటికీ బిల్లులు చెల్లించలేదని, దాంతో పెట్టుబడులకు డబ్బులు లేక రైతులు అల్లాడుతున్నారని తెలిపారు. డోర్నకల్ నుంచి ఖమ్మం రూరల్, నేలకొండపల్లి మీదుగా మిర్యాలగూడ వరకు చేపట్టిన రైల్వే లైన్ అలైన్‌మెంట్ వల్ల రైతాంగానికి తీరని నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని, లేని యెడల మార్కెట్ విలువకు ఐదు రెట్లు అదనంగా పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీకి చెరకు తరలించి నెలలు గడుస్తున్నా నేటికీ బిల్లులు చెల్లించలేదన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు అందజేశారు. నూతన రైల్వే లైన్ ఏర్పాటుతో భూములు కోల్పోయే రైతాంగం సైతం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఎట్టి పరిస్థితుల్లో తమ పంట భూములను పణంగా పెట్టబోమని రైల్వే లైన్‌కు ప్రత్యేక మార్గాలను అన్వేషించుకోవాలని బాధిత రైతులు సూచించారు. రైతాంగ సమస్యలపై అధికారులకు రిపోర్ట్ చేస్తానని, తన వంతు బాధ్యతగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాననితహశీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు వై.విక్రమ్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, రచ్చ నరసింహారావు, పార్టీ మండల కార్యదర్శి కె.వి రామిరెడ్డి, నాయకులు ఏటుకూరి రామారావు, భూక్య కృష్ణ, దుగ్గి వెంకటేశ్వర్లు, మందడపు మురళీకృష్ణ, కట్టెకోల వెంకన్న, భూక్య జ్యోతి, నూతన రైల్వే లైన్ బాధిత రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో బిజెపి విభజన రాజకీయాలు ఆపాలి

- ఎఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్
- హిమాయత్ నగర్ 'వై' జంక్షన్ వద్ద నిరసన, ర్యాలీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మణిపూర్‌లో జరుగుతున్న హింస, అల్లర్లపై ప్రధాని మోడీ మౌనం వీడి.. శాంతిని నెలకొల్పేందుకు విభజన రాజకీయాలను తుది ముట్టించాలని ఎఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ డిమాండ్ చేశారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సోమవారం హిమాయత్‌నగర్‌లోని ఎన్.సత్యనారాయణరెడ్డి భవన్ నుంచి 'వై' జంక్షన్ వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా తిరుమలై రామన్ మాట్లా డుతూ.. ప్రధాని మోడీ ఎన్నికల తీర్థయాత్ర కోసం ఛత్తీస్‌గఢ్, తెలంగా ణ, మధ్యప్రదేశ్‌కు వెళ్తున్నారే తప్ప ఘర్షణలు జరుగుతున్న మణ ిపూర్‌లో మాత్రం పర్యటించకపోవడం సిగ్గు చేటన్నారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పడంలో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం విఫలమయ్యాయని విమర్శించారు. హోంమంత్రి అమిత్ షా, మణిపూర్ ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ కేంద్రం,రాష్ట్రాలలో బిజెపి ప్రభుత్వాలు 'విచ్ఛిన్నకర రాజ కీయాలు' చేస్తున్నందు వల్లే మణిపూర్ మంటల్లో చిక్కుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర మాట్లా డుతూ.. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పేందుకు కృషి చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19వ తేదీ వరకు భారత ప్రధాన మంత్రికి ఈ-మెయిల్, పోస్ట్ కార్డ్ ఉద్యమం నిర్వహిస్తున్నట్టు జాతీయ సమితి ప్రకటించిందరి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జాతీయ నేతలు హరీష్, భారతి, కరంవీర్ కౌర్, సంతోష్, శంభుదేవా, విక్రాంత్ సింగ్, దేవేందర్, రాకేష్, ఎఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు నెర్లకంటి శ్రీకాంత్, సల్మాన్ బైగ్, టి.సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసిలో మాస్టర్ పేస్కేలు అమలు చేయాలి

- కార్మిక శాఖ అదనపు కమిషనర్ గంగాధర్‌కు ఆర్‌టిసి జెఎసి వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసిలో తక్షణమే ఎన్నికలు జరిపేలా చర్యలు తీసుకోవాలనీ, సిబ్బందికి మాస్టర్ పేస్కేలు అమలు చేయడంతో పెండింగ్‌లో ఉన్న రెండు పిఆర్‌సిలను వర్తింపజేయాలని ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఇ.అశ్వత్థామరెడ్డి, కన్వీనర్ కె.హనుమంతు ముదిరాజ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో అదనపు కమిషనర్ గంగాధర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఆర్‌టిసిలో సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికలు జరిపేలా చూడాలని కోరారు. అనంతరం కమిషనరేట్ బయట వారిద్దరూ మీడియాతో మాట్లాడారు. కార్మికులను చైతన్యం చేయడం కోసం డిపోల్లో భరోసా యాత్రలు చేపడుతున్నామని చెప్పారు. జెఎసితో మిగతా సంఘాలు కూడా కలిసిరావాలని కోరారు. ఆర్‌టిసి కార్మిక సంఘాలు చేస్తున్న పోరాటానికి అందరూ మద్దతు తెలపాలని కోరారు. కార్మికులతో సంస్థ 12 నుంచి 15 గంటలు పనిచేయించడం దారుణమనీ, వేధింపులను ఆపాలని డిమాండ్ చేశారు. పక్కరాష్ట్రంలో మాదిరిగా ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసి సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సిసిఎస్, పిఎఫ్ డబ్బులను వెంటనే రిలీజ్ చేయాలని విన్నవించారు. 2021లో విడుదల చేసిన ఉద్యోగభద్రత గైడ్‌లైన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసిలోని హైర్ బస్సులన్నింటినీ సంస్థ స్వాధీనం చేసుకోవాలనీ, వాటిపై పనిచేస్తున్న డ్రైవర్లను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఎనిమిది గంటలు దాటి పనిచేస్తే డబుల్ వేజ్ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ కో-కన్వీనర్లు నరేందర్, సుద్దాల సురేశ్, హరికిషన్, సత్యనారాయణరెడ్డి, స్వాములయ్య, చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.